జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శుక్రవారం, ఫిబ్రవరి 20, 2026 పేజీలు:6







## పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్ పనులకు

# కలెక్టర్ అల్టిమేటం

- మార్చి నెలాఖరు లోగా రూ.173 లక్షల వినియోగం పూర్తి చేయాలి
- అధికారులకు కఠిన ఆదేశాలు



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19:( ప్రజా జ్యోతి బ్యూరో )** జిల్లాలో అమలవుతున్న పిఎం శ్రీ స్కూల్ పథకం కింద మంజూరైన అన్ని నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి, వాటికి కేటాయించిన నిధులను మార్చి నెలాఖరు లోగా పూర్తిగా ఖర్చు చేసి వినియోగ నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర భోయి సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, వాననీటి హార్వెస్టింగ్ పిట్స్, మరుగుదొడ్లు, లైబ్రరీ గదులు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని సూచించారు.జిల్లాలో సుమారు 69 నిర్మాణ పనులు ఇంకా పూర్తి కావలసి ఉన్నాయని,

-మిగతా 2లో..

# డ్యూటీకి డుమ్మా...

- విందులో వాలిన పంతుళ్లు!

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

- మిడ్జిల్ జెడ్పీహెచ్ఎస్ ఘటనపై విద్యా కమిషన్ మెంబర్ చారగొండ వెంకటేష్ ఆగ్రహం



**మిడ్జిల్/మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19:**
**( ప్రజా జ్యోతి) బ్యూరో )**

మిడ్జిల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం చోటుచేసుకున్న ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బడి వేళల్లో అనుమతులు లేకుండా ఉపాధ్యాయులు గుంపుగా బయటకు వెళ్లి విందులో పాల్గొనడం, మధ్యాహ్నం రెండు గంటలు దాటినా విధుల్లో చేరకపోవడం తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. ఇదే సమయంలో తరగతి గదుల్లో విద్యార్థులతో ఊడ్చివేత పనులు చేయించారన్న ఆరోపణలు మరింత కలకలం రేపాయి.

ఈ ఘటనపై రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్ స్పందించారు. గురువారం జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్ తో కలిసి పాఠశాలను సందర్శించి సంఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా

-మిగతా 2లో..



# ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

శోభాయాత్రకు డిప్యూటీ మేయర్ శ్రీకారం

- బండమీదిపల్లి చౌరస్తాలో భక్తి, దేశభక్తి జ్వాలలు రగిలించిన వేడుకలు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19:**
**( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్‌నగర్ పట్టణంలోని బండమీదిపల్లి చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. "హిందూ వాహిని" ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మరేపల్లి సురేందర్ రెడ్డి (ఎంఎస్ఆర్) పాల్గొని మహనీయుడి విగ్రహానికి పుష్పమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, దేశభక్తి, పరిపాలనా దక్షత యువతకు ఆదర్శమని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. సమాజంలో ధర్మం, న్యాయం, స్వాభిమానం కోసం పోరాడిన మహానుభావుడిగా శివాజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో యువకులు, మహిళలు పాల్గొనగా, సాంప్రదాయ వాద్యాలతో శోభాయాత్రను డిప్యూటీ మేయర్ ప్రారంభించారు. బండమీదిపల్లి ప్రాంతమంతా జయజయధ్వానాలతో మారు మోగింది.



## పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్ పనులకు

# కలెక్టర్ అల్టిమేటం

వాటికి సంబంధించిన రూ.173 లక్షల నిధులను మార్చి నెలాఖరు లోగా ఖర్చు చేసి వినియోగ వివరాలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మంజూరైన నిధులు ల్యాప్స్ కాకుండా చూడాలని ఆమె హెచ్చరించారు.
ఈ సందర్భంగా తెలంగాణ విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్రయ్య మండలాల వారీగా పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎలాంటి అడ్డంకులు ఉన్నా వెంటనే పరిష్కరించి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అడ్డాకల్, రాజాపూర్, బాలానగర్, నవాబ్‌పేట్, జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మండలాల్లో పీఎం శ్రీ పథకం కింద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో అదనపు గదులు, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, సోక్ పిట్స్ తదితర పెండింగ్ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో విద్యాశాఖ ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డ్యూటీకి డుమ్మా...

మాట్లాడి వాస్తవాలు సేకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై వచ్చిన ఆరోపణలపై కూడా స్థానికులను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం మీడియాతో మాట్లాడుతూ, బాధ్యులెవ్వరైనా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. "బడి సమయంలో విధులు విస్మరించి బయట కార్యక్రమాల్లో పాల్గొనడం అనేది అసహ్యం. విద్యార్థులతో పనులు చేయించడం మరింత తీవ్రమైన విషయం. ఇందులో ఎవరు ఉన్నా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై స్థానిక సర్పంచ్ శంకర్ ముదిరాజ్‌తో కూడా చర్చించి పరిష్కార మార్గాలపై సూచనలు ఇచ్చారు. గత దశాబ్దంలో దెబ్బతిన్న విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక తరగతుల నుంచి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### పబ్లిక్ స్కూల్ తరహాలో అభివృద్ధి

మిడ్జిల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

పాఠశాల క్రమశిక్షణ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన వారిపై ప్రభుత్వం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రాక నేడే: ఆర్.ఎస్. ఫౌండేషన్ డైరెక్టర్ బ్రహ్మయ్య

చిన్నంబావి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి): చిన్నంబావి మండల కేంద్రంలోని వెల్లటూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి వీపనగండ్ల మండల మాజీ జెడ్పిటిసి పరిమాళ్ల బాలకిష్ణయ్య ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ శుక్రవారం వెల్టూరు గ్రామానికి రానున్నట్లు ఆర్.ఎస్. ఫౌండేషన్ డైరెక్టర్ కారంగి బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనతో పాటు రాష్ట్ర నాయకులు అభిలాష్ రావు కూడా పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేయనున్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సకాలంలో హాజరుకావాలని నాయకత్వం పిలుపునిచ్చింది. చిన్నంబావి కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై ఐక్యతను చాటాలని బ్రహ్మయ్య కోరారు. మాజీ జెడ్పిటిసి పరిమాళ్ల బాలకిష్ణయ్య సేవలను స్మరించుకుంటూ పార్టీ నాయకులు నివాళు లర్పించనున్నారు.

## పీఎండీడీకేవై పథకం అమలు పురోగతిపై సమీక్ష

**-ఆయిల్ సీడ్ పరిశోధన డైరెక్టర్ డా. పొన్నుస్వామి**



నారాయణపేట, ఫిబ్రవరి 19:

ప్రధాన మంత్రి ధన్ ధన్య యోజన (పీఎండీడీకేవై) ప్రత్యేక అధికారి, భారత ప్రభుత్వ ఆయిల్‌సీడ్స్ పరిశోధన డైరెక్టర్ డా. పొన్నుస్వామి గురువారం నారాయణపేట జిల్లాను సందర్శించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీఎండీడీకే వై పథకం అమలు పురోగతిని సమగ్రంగా పరిశీలించారు.
సమీక్షలో జిల్లా స్థాయి అధికారులు శాఖల వారీగా పథకం అమలుపై వివరాలు సమర్పించారు. కార్యక్రమం మరింత సమర్థవంతంగా అమలు కావడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని డా. పొన్నుస్వామి సూచించారు. వ్యవసాయ, మత్స్య, పాడి పరిశ్రమ, కో-ఆపరేటివ్, గ్రామీణాభివృద్ధి, ఉద్యాన శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించి అమలు విధానంపై మార్గదర్శకాలు ఇచ్చారు. అంతకుముందు డా. పొన్నుస్వామి మరికల్ మండలంలో కూరగాయలు, ఆయిల్ పామ్, మొక్కజొన్న పంట పొలాలను సందర్శించి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. పంటల స్థితిగతులు, సాగు పద్ధతులు, ఉత్పాదకత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించారు. పథకం అమలులో ఎదురవుతున్న సవాళ్లు, మెరుగుదల అవకాశాలపై రైతుల అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, డీఆర్‌డీఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, కోఆపరేటివ్ జిల్లా అధికారి ప్రసాద్ రావు, జిల్లా వెటర్నరీ ఉ పశు సంవర్ధక అధికారి ఈశ్వర్ రెడ్డి, నాబార్డ్ ఏజీఎం షణ్ముఖ చారి, ఎల్డీఎం విజయకుమార్, డీపీఓ సుధాకర్ రెడ్డి, సైంటిస్ట్ రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. పీఎండీడీకే వై పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఉత్పాదకత వృద్ధి, వ్యవసాయ ఆధారిత రంగాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## శివాజీ జయంతి శోభాయాత్రలపై కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నిఘా

**-ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ పర్యవేక్షణ**

నారాయణపేట ఫిబ్రవరి 19:

చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన శోభాయాత్రలు, బైక్ ర్యాలీలను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ర్యాలీల పరిస్థితిని సమీక్షిస్తూ సంబంధిత పోలీస్ అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.
జిల్లాలోని నారాయణపేట, కోస్గి, మద్దూర్, మక్తల్, ఉట్కూర్, మరికల్ ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ర్యాలీల మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదనంగా సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి



అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. ప్రజలు శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలని, చట్టాన్ని గౌరవించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు అప్రమత్తంగా పనిచేస్తూ ఎక్కడైనా ఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.
ఈ సందర్భంగా ఎస్పీతో పాటు ఎస్బీ ఎస్ఐ నరేష్, ఐటీ కోర్ టీమ్ సభ్యుడు శ్రీనివాసులు హాజరయ్యారు.

### శివాజీ జయంతి శోభాయాత్రకు కట్టుదిట్టమైన బందోబస్తు
### బందోబస్తు పర్యవేక్షించిన డీఎస్పీ నల్లపు లింగయ్య

చజత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయబడింది. ఈ బందోబస్తును డీఎస్పీ నల్లపు లింగయ్య స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు సహా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ర్యాలీ మార్గాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. శోభాయాత్ర శాంతియుతంగా సాగేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి డీఎస్పీ సూచించారు.
ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించరాదని ఆదేశించారు. ర్యాలీ మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం







**కొల్లాపూర్ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి**

మునిసిపల్ పట్టణ పరిధిలో ఉన్న పురపాలక సంఘ భవనంలో నూతనంగా ఎన్నికైన మునిసిపల్ చైర్మన్ రెడ్డి జ్యోతి సత్యం ను మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల రమ్య నాగరాజు గురువారం రోజు పురపాలక సంఘం ఆఫీస్ భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో చైర్మన్లు వైస్ చైర్మన్ మహమ్మద్ రహీం భాష ను కలిసి పూలదండలతో శాలువతో సన్మానించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పదవికి వైస్ చైర్మన్ పదవికి కొత్తగా ఎన్నికైన సందర్భంగా వారికి మిఠాయిలతో తీపి అందించి పట్టణ ప్రగతి కోసం ముందుకు సాగాలని అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేయాలి అభివృద్ధికి మేము మీకు తోడుంటామని భరోసానిచ్చిన మాజీ మునిసిపల్ చైర్మన్ ప్రజెంట్ ఐదో వార్డు గెలుపొందిన కౌన్సిలర్ మేకల రమ్య నాగరాజు. పట్టణ పరిధిలో ఉన్న 19 వార్డులలో ఉన్న కౌన్సిలర్లను చిన్న పెద్ద తేడా లేకుండా అందరిని కలుపుకొని కొల్లాపూర్ అభివృద్ధి ముందు దిశగా అడుగులు వేయాలని వారు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ పదవి పట్టం కొల్లాపూర్ ప్రజలు మీకు కట్టిన సందర్భంగా ప్రజలకు కొల్లాపూర్ ప్రగతి బాటకు నిరంతరం కృషి చేసి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని మాజీ చైర్మన్ వివరించారు.

కార్యక్రమంలో. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూరన్న గారు,మెహది నవాజ్ గారు,బద్దుల చంద్రు గారు, పంజాబీ నాథ్ గారు,కాంగ్రెస్ పార్టీ టౌన్ యూత్ అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి గారు, సందీప్ గారు, దత్తాత్రేయ గౌడు మరియు కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారుబి .

## చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల వేడుకలను నిర్వహించిన ఎస్ఎఫ్ఐ





**కొల్లాపూర్ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి**

పట్టణ పరిధిలో ఉన్న పీజీ కళాశాల భవనంలో చత్రపతి శివాజీ మహారాజ్.1630. వ జయంతి వేడుకలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఇట్టికార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కుమారస్వామి ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ పాల్గొని చత్రపతి శివాజీ మహారాజ్ మహారాష్ట్రలో 1630 వ సంవత్సరంలో జన్మించి శూద్రుల లో పుట్టి మహోన్నతమైనపరిపాలన మొఘల్ పైపోరాడటం మే కాకుండ పిష్వాల పై గెరిల్లా యుద్ధం చేశాడని రైతుల క్షేమం మనుషుల పట్ల సమానత్వం స్త్రీలపై గౌరవం రాజపరిపాలన అష్ట ప్రదాన మండలి భూమి ప్రధానం మత సంస్కృతి సంస్కరణలు, మతసామరస్యం చత్రపతి మహారాజ్ కేవలం అధికారం కోసమే కాకుండా ప్రజల సంక్షేమం రైతు వారి కోసం సాగింది అందుకే ఈయన పాలనను సురాజ్యం అని పిలుస్తారని,మహాత్మా పులే ఈ దేశానికి ఆయన చరిత్రను చాలా వరకు సేకరించి మనకు అందించారని కానీ కొంతమంది ఆయన చరిత్రను వక్రీకరిస్తున్నారని దానిని విశ్వవిద్యాలయ విద్యార్థులుగా పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, బహుజన చక్రవర్తి శివాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.కార్యక్రమంలో అధ్యాపకులు డా.పర్వతాలు,డా.సుదర్శ రెడ్డి
డా.రవికుమార్,రవీందర్, ఎస్ఎఫ్ఐ. పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షులు బత్తిని రాము, శేఖర్, పరమేష్, వినోద్,రమేష్,జ్ అంజి ,రాకేష్, మహేష్,కీర్తి,శ్రావణి,శిరీష తదితరులు పాల్గొన్నారు

## త్రాగునీటి సమస్య తీర్చడానికి మోటార్లను బాగు చేసిన ఖాజీపూర్ గ్రామ సర్పంచ్

**మద్దూర్ మండల ప్రతినిది ప్రజాజ్యోతి ఫిబ్రవరి19:**

మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ సాయప్ప,ఉపసర్పంచ్ సి.భీమమ్మ తక్షణ చర్యలు చేపట్టారు.ఖాజీపూర్ తండాలో కొత్త మోటార్ వేసి మరియు ఎస్సి కాలనీ లో పాడైపోయిన బోర్‌వెల్ మోటార్లను మరమ్మతులు చేయించి,నిలిచిపోయిన నీటి సరఫరాను పునరుద్ధరించారు.కొన్ని రోజులుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు ఈ చర్యతో ఉపశమనం లభించింది.మోటార్ల మరమ్మతులతో పాటు పైపులైన్ లోపాలను కూడా సరిచేసి,ప్రతి ఇంటికి సమయానికి త్రాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.గ్రామ ప్రజలు సర్పంచ్,ఉపసర్పంచ్ వార్డు సభ్యులను అభినందిస్తూ,సమస్యలను వెంటనే పరిష్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడం అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండి షాజిల్,సి.చంద్రప్ప,ఎండి.ఖాజా,పి.కృష్ణ,లాలప్ప,శ్రీనివాస్,గోవిందు,బీములు, సర్వనాయక్,రాములు,తదితరులు పాల్గొన్నారు.









## బస్సు అదుపుతప్పి ప్రమాదం -పలువురికి గాయాలు






**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతీ) ఫిబ్రవరి 19:**

డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు ప్రమాదం హైదరాబాద్ నుంచి అనంతపురం వెళుతున్న ఏపీ.ఎస్.ఆర్.టి.సి.ఏపీ 39 జెడ్ 0557 గల బస్సు గురువారం తెల్లవారుజామున 4:20 నీ”సమయమందు హైవే ఎన్ హెచ్ 44 వ రోడ్డులో ప్రమాదం.ఉండవల్లి మండలం ఇటిక్యాల పాడు స్టేజి కాడ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు అదుపుతప్పి బోల్తా పడింది.ఈ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా ఒకరి చెయ్యి వేలు విరిగాయి.మరో వ్యక్తి చెయ్యి నుజునుజ్జయింది మిగతా ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.గాయాలతో ఉన్న వ్యక్తులను చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించడం జరిగింది అని ఉండవల్లి ఎస్సై శేఖర్ తెలిపారు.

## అలంపూర్ మున్సిపల్ చైర్మన్‌గా పిండి జయరాముడు పదవీ బాధ్యత

**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతీ) ఫిబ్రవరి 19:**




అలంపూర్ మున్సిపల్ చైర్మన్ గా గురువారం బాధ్యతలు చేపట్టడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి రెడ్డి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టడంతో ఎమ్మెల్సీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

## పెద్దపల్లి గ్రామంలో మారెమ్మ అవ్వ గుడి నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన

**మల్దకల్ ఫిబ్రవరి 19(ప్రజా జ్యోతి డివిజన్):**



మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ అవ్వ గుడి నిర్మాణ కార్యక్రమానికి గురువారం ఘనంగా శ్రీకారం చుట్టారు.గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామస్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గుడి నిర్మాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,పెద్దపల్లి గ్రామం సురక్షితంగా ఉండాలని,రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని,గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని మారెమ్మ అవ్వను ప్రార్థించారు.గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**కొల్లాపూర్ ఫిబ్రవరి 19 ప్రజాజ్యోతి**

పెంట్లవెల్లి మండల కేంద్రంలో చత్రపతి శివాజీ మహారాజ్ గారి జయంతి వేడుకలను అన్ని పార్టీలతో కలిసి చత్రపతి శివాజీ మహారాజ్ 1630. వ జయంతి వేడుకలను ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి జయంతి వేడుకలను ఘనంగానిర్వహించారు.

ఆర్ఎస్పి ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర బోర్డు డైరెక్టర్, డిఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా యువ నాయకులు కారంగి బ్రహ్మయ్య మాట్లాడుతూ.

బహుజన సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ యుద్ధతంత్రాలలోనే కాకుండా పరిపాలనా విధానంలోనూ అందరు రాజులలో అగ్రగణ్యుడు రాజరికానికి అనర్హులు అన్న కుల కట్టుబాట్లను ఎదిరించి అట్టడుగు కులం నుంచి రాజు స్థాయికి ఎదిగారు. ప్రజా సంక్షేమం కోసం కుల,మతాలకు అతీతంగా అనేక ఆర్థిక సామాజిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.తన ఆస్థానంలో రాజభాష అయిన పర్షియన్‌కు బదులుగా ప్రజల భాష అయిన మరాఠీ ని ప్రోత్సహించారు.మహిళా స్వేచ్ఛను ప్రోత్సహించారు రైతులకు మరియు రాష్ట్రానికి మధ్య దళారుల అవసరాన్ని తొలగించి జమీందారీ వ్యవస్థను రద్దు చేసారు తయారీదారులు మరియు ఉత్పత్తిదారుల నుండి నేరుగా ఆదాయాన్ని సేకరించే రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టి స్ఫూర్తి ప్రధాతగా నిలిచారు.



కార్యక్రమంలో. వార్డు మెంబర్లు శశి మాజీ సర్పంచ్ కోట్ల సురేందర్ బిజెపి నాయకులు శ్రేణులు టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు చత్రపతి శివాజీ అభిమానులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నర్వ మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్



**నర్వ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి**

నర్వ (యాస్పరేషన్ బ్లాక్) మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ నెల 24 న నర్వ యాస్పిరేషన్ బ్లాక్ మండలాన్ని నీతి అయోగ్ అదనపు మిషన్ డైరెక్టర్ సందర్శిస్తున్నందున ఆ సందర్శన సన్నాహాలను గురువారం కలెక్టర్ పర్యవేక్షించారు. ముందుగా నర్వ మండలంలోని పెద్ద కడుమూర్ గ్రామ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను కలెక్టర్ సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సౌకర్యాలు, పరికరాలు, విద్యార్థుల పురోగతి, మధ్యాహ్న భోజనం నాణ్యత, పీఎం శ్రీ స్కూల్ పథకం కింద వార్షిక బడ్జెట్ వ్యయం,కొనసాగుతున్న పాఠశాల కార్యక్రమాలు, టాయిలెట్ సౌకర్యాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏ ఎక్స్ ఎల్ ల్యాబ్, లైబ్రరీ గదులను పరిశీలించారు. వాటి వినియోగం గురించి ఆయా పాఠశాలల హెచ్ఎం లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయికోడ్ గ్రామంలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించారు, ప్రీ-స్కూల్ పిల్లలు అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో సంభాషించారు. చిన్నారులతో కరచాలనం చేసి ఉత్సాహ పరిచారు. అంగన్‌వాడీ కేంద్రాలలోశ్యామ్ (తీవ్రంగా తీవ్రమైన పోషకాహార లోపం)మ్యామ్ (మధ్యస్థంగా తీవ్రమైన పోషకాహార లోపం) పిల్లల స్థితిని సమీక్షించారు. చివరగా నర్వ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి సౌకర్యాలు, సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో శిక్షణా కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిఆర్డిఓ మొగులప్ప, ఎంపీడీవో శ్రీనివాస్, యాస్పరేషన్ బ్లాక్ సమన్వయకర్త బాలాజీ, ఎంఈఓ, సిడిపిఓ పాల్గొన్నారు.



## పెద్దమారూర్ గ్రామశీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**- యువతలో జాతీయ స్ఫూర్తి వెల్లివిరింపు**

**చిన్నంబావి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి):**

చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దమారూర్ గ్రామం గురువారం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. స్వరాజ్య స్థాపకుడు, ధైర్యసాహసాలకు ప్రతీక అయిన మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. యువత చేతుల్లో కాషాయ జెండాలు రెపరెపలాడగా "జై శివాజీ -- జై భవాని" నినాదాలతో గ్రామ వీధులు మార్మోగాయి. అనంతరం శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.వక్తలు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలను అర్థం చేసుకుని స్వరాజ్య స్థాపన కోసం నిరంతరం పోరాడిన మహానేతగా శివాజీని భారతదేశం యుగయుగాల పాటు స్మరించుకుంటుందని పేర్కొన్నారు. మరాఠా సామ్రాజ్యం హిందువుల ధైర్యానికి, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ప్రజల రక్షణ కోసం ఆయన చూపిన పరిపాలన, శౌర్యం, నాయకత్వం నేటి తరానికి ఆదర్శమని అభిప్రాయపడ్డారు.సమాజంలో న్యాయం, ధర్మం, ఐక్యత కోసం పోరాడిన శివాజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని యువత పిలుపునిచ్చారు. దేశభక్తి, క్రమశిక్షణ, ధైర్యం వంటి విలువలు యువతలో



పెంపొందాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు మూగి లోకేష్ యాదవ్, శివ సంపత్ కుమార్, పరమేష్ నాయుడు, ప్రవీణ్ యాదవ్, గువ్వల కార్తీక్ తదితరులు ప్రధానంగా పాల్గొన్నారు. అలాగే సర్పంచ్ భర్త కె. లక్ష్మయ్య, ఉపసర్పంచ్ ఎం. నరేష్ యాదవ్, అనుకలి శివరాముడు, టీచర్ ఎస్. శ్రీనివాసులు, పి. రాజ్‌కుమార్, మధు టీచర్, భగవంతు రెడ్డి, తెలుగు చిన్న నరసింహ, సురేష్, ప్రవీణ్, సురేష్ నాయుడు, వార్డు సభ్యుడు పురేందర్ నాయుడు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


## గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ బి.శంకరన్నకు ఘన సన్మానం



**గద్వాల ఫిబ్రవరి 19(ప్రజా జ్యోతి డివిజన్):**

గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.శంకరన్నకు గువ్వలదిన్నె గ్రామ ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎం.ఆర్.పి.ఎస్ ప్రతినిధులు డా.బి ఆర్ అంబేద్కర్ చిత్రపటం,పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజాసేవలో మరింత కృషి చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని వారు ఆకాంక్షించారు.సన్మానానికి స్పందించిన బి.శంకరన్న మాట్లాడుతూ,ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు.మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సి.ఎం.సురేష్




**ఐజా (ప్రజా జ్యోతీ) ఫిబ్రవరి 19:**

ఐజా మున్సిపల్ కమిషనర్ సైదులు మేనేజర్ అశోక్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది సమక్షంలో వేద పండితుల ఆధ్వర్యంలో సీఎం.సురేష్ కి ప్రత్యేక పూజలునిర్వహించారు.గురువారం మున్సిపల్ చైర్మన్ గా సీఎం.సురేష్.వైస్ ఛైర్మన్ మాల నరసింహులు తో కలిసి బాధ్యతలు చేపట్టడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టడంతో అభిమానులు,బిఆర్ఎస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసారు.

## నేడు సుల్తాన్ అలీషా సాహెబ్ ఉర్సు

**-భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి -భక్త బృందం సభ్యులు**

నాగర్ కర్నూల్:ఫిబ్రవరి 19ప్రజా జ్యోతి హైదరాబాద్ భోయిగూడాకమాన్ లోని హజ్రత్ ఖాజా సయ్యద్ సుల్తాన్ అలీషా బుఖారి రహమతుల్లా అలే ఉర్సు ఉత్సవాలు శుక్రవారం రాత్రి గంధం ఉత్సవంతో ప్రారంభం అవుతాయని భక్త బృందం సభ్యులు గురువారం ఓ ప్రకటనలోతెలిపారు.దర్గా హజరత్ హారుని జానషీన్ ఖలీఫా ఏ దుల్హె పాషా దర్గా ముతవల్లి,సజ్జాదే నషీన్‌హజరత్ సయ్యద్ షా ఖాజా నిజాముద్దీన్ హారుని ఆధ్వర్యంలో గంధం తోపాటు ఉరుసు ఉత్సవాలు జరుగుతాయని 20వ, తేదీన గందోత్సవం,21 నచిరాగా, 22 ఖురాన్ ఖానీ ఇతర కార్యక్రమాలు ఉంటాయని,గంధోత్సవం రోజు సాయంత్రం 5:00

గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమై ఖవ్వాలి, గంధంతో పాటు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయాని,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

# చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**చిన్నంబావి,ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల కేంద్రంలోని చత్రపతి శివాజీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ సింగిల్ విండో చైర్మన్ నరసింహారెడ్డి, కొల్లాపూర్ తాలూకా వాల్మీకి సంఘం అధ్యక్షులు రాజ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ లక్ష్మోజీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చత్రపతి శివాజీ 1630 ఫిబ్రవరి 19న శివనేరి కోటలో జన్మించారని, చిన్న వయసులోనే ధైర్యసాహసాలతో యుద్ధ రంగంలో అడుగుపెట్టిన మహావీరుడని కొనియాడారు. 1674లో రాయగఢ్ కోటలో సర్వభౌమ మహారాజుగా పట్టాభిషేకం జరగడం ఆయన చరిత్రలో కీలక ఘట్టమని తెలిపారు.హిందూ సామ్రాజ్య స్థాపకుడిగా, సనాతన ధర్మ పరిరక్షకుడిగా, న్యాయపరుడైన పరిపాలకుడిగా శివాజీ విశిష్ట స్థానాన్ని సంపాదించారని పేర్కొన్నారు. మొఘల్ సైన్యానికి ఎదురొడ్డి పోరాడిన వీరుడిగా, మహిళల గౌరవాన్ని కాపాడిన ధీరుడిగా ఆయనను స్మరించుకున్నారు. బీజాపూర్ సేనాధిపతి అఫ్జల్ ఖాన్‌పై సాధించిన విజయం, ఔరంగజేబు నిర్బంధం నుండి తప్పించుకున్న ఘటనలు ఆయన అసామాన్య ధైర్యానికి నిదర్శనమని వివరించారు.తల్లి జిజాబాయి ఇచ్చిన ప్రేరణతో స్వరాజ్య స్థాపన లక్ష్యంగా ముందడుగు వేసిన శివాజీ, యువకుడిగానే



కోటలను స్వాధీనం చేసుకుని స్వతంత్ర రాజ్య నిర్మాణానికి పునాది వేశారని తెలిపారు. రైతులకు అనుకూల విధానాలు అమలు చేసి ప్రజాహిత పరిపాలన అందించారని కొనియాడారు.1680 ఏప్రిల్ 3న శివాజీ పరమపదించినప్పటికీ ఆయన స్ఫూర్తి నేటికీ యావత్ దేశాన్ని ప్రభావితం చేస్తోందని అన్నారు.జయంతి సందర్భంగా మిఠాయిలు, పండ్లు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ నరేష్, నరసింహారెడ్డి, రాజ్ కుమార్ నాయుడు, డాక్టర్ లక్ష్మోజీ, కాంతరెడ్డి, సుధాకర్, భీమయ్య శెట్టి, క్యాథూర్ రాముడు,శ్రీనివాసులు, నాగోజి, రామకృష్ణ, జహంగీర్, ఎస్.శ్రీనివాసులు తదితరులు, పలువురు పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## శివాజీ ఒక శూద్రుడు కాబట్టి రాజుగా అంగీకరించడానికి బ్రాహ్మణులు ఒప్పుకోలేదు

**రాజ్యంలో ఏ బ్రాహ్మణుడు ముందుకు రాకపోతే**
**మనిషెత్తు బంగారం సమర్పించుకొని**
**కాశీ నుండి గంగ బట్టు అనే బ్రాహ్మణుడిని పిలిపించి**
**చత్రపతి శివాజీ పట్టాభిషేకం చేయించుకున్నాడు**
**అది బ్రాహ్మణుడు కాళి బ్రతుకైన వేలితో**
**దిద్దిన తిలకంతో మహావీరుడు శివాజీ**


కొల్లాపూర్ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి

పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్1630. వ జయంతి సందర్భంగా ట్రాక్టర్ పైన చత్రపతి
శివాజీ చిత్రపటాన్ని పెట్టి పెద్దమ్మ గుడి సెంటర్ దగ్గర డిజె సౌండ్ చత్రపతి శివాజీ పాటలతో యువకులు ఆటపాటలతో ఉత్సాహంగా యువకులు పాల్గొన్నారు. చత్రపతి శివాజీ చేసిన పనులను స్మరించుకుంటూ నినాదాలు చేసుకుంటూ వీధి వీధినా ఊరేగింపు గ్రామంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు కలిసి వీధిలో వెంబడి ఊరేగింపుగా గ్రామంలో బయలుదేరారు.అన్ని పార్టీల నాయకులు యువకులు కలిసి నిర్వహించారు.ఒక శూద్రుడు సూద్రుడికి ఈ దేశంలో కత్తిపట్టే హక్కులేదు అది కేవలం క్షత్రియకులానికే వుంది కానీ ముస్లిం పాలకులు రావడంతో మొదటిసారి భారీగా కిందికులాలు కత్తిపట్టి సుల్తానులకింద తమ శౌర్యాన్ని నమ్మకాన్ని చూపి పదవులు పొందాయి. అలా పదవులు పొందిన కుటుంబాలలో దక్కను ప్రాంతాన్ని పాలించిన అహ్మద్నగర్ బీజాపూరు బీదరు బీరార్ గోల్కొండ సుల్తానులకింద చాలామంది ఎదిగారు ఆలా ఎదిగిన వాళ్లలో శివాజీ కుటుంబం బంధువులు వున్నారు. శివాజీ తండ్రి షాజీ భాన్స్లే అతని బంధువులు ఈ సుల్తానుల వద్దనే నమ్మకమైన సేనానులుగా పనిచేశారు తండ్రి బాబాయి వరుసలో కత్తివిద్యలు నేర్చిన శివాజీ మాంగ్ మహర్ కోలీ సొంకాలీ రామోసీ జింజిర సిద్దీలు వంటి కిందికులాలకు చెందిన యువకులు ముఖ్యంగా అప్పటికే తండ్రి బాబయ్‌లకు మొదటిసారి సైన్యంలో అవకాశం కల్పించిన ముస్లిం పాలకుల కింద పనిచేసి మతం మారిన ఇతర ముస్లిం యువకులతో ఒక స్వతంత్ర ప్రాంతం ఏర్పాటు చేసుకుని పాలించాలని కలలుగని దాని సాధనకోసం పోరాడాడు.

అయితే అతడు అప్పుడు పోరాడింది పక్కనేవున్న అహ్మద్నగర్,బీజాపూర్‌లని పాలించిన సుల్తానులు ఢిల్లీలో మొఘలు పాలకులు ఇస్లాం మతానికి చెందినవారు కాబట్టి శివాజీని హిందూ పాలకుడుగా ఇస్లాం పాలకులమీద పోరాడినట్లు తర్వాతి కాలంలో అనువదించారు దీనికి కారణాలు చూసే ముందు సమాకాలీనంలో వాస్తవాల్ని చూస్తే

శివాజీ మాలిక్ అంబర్ అనే ప్రఖ్యాత గెరిల్లా యుద్ధవిద్యల ద్వారానే రాజ్యం సాధించాడు శివాజీ సైన్యంలో దాదాపు అందరూ కిందికులాలవాళ్లు ముస్లింలే ఒకసారి అతడి పక్కనున్నవారిని చూస్తే

అతడిఅయుధాగారాధిపతి ఇబ్రహీంఖాన్ ఒక ముస్లిం నావికాదళపతి సిద్దీ సంభాల్ ఒక ముస్లిం శివాజీ అత్యత నమ్మకస్తుడు విదేశీ వ్యవహారాల మంత్రి మౌలానా హైదర్ ఒక ముస్లిం అఫ్జల్‌ఖాన్ అనే సైనికాధికారిని చంపినా అతని గౌరవం కోసం ఒక దర్వాజాని రాయగడ్ లో నిర్మించాడు అఫ్జల్‌ఖాన్ ని అంతమొందించడానికి భగ్నక్ అనే ఉక్కుగోళ్లని అందించి శివాజీ ప్రాణాలు





కాపాడినవాడు రస్తిం జమాన్ ఒక ముస్లిం ఔరంగజేబుతో యుద్ధంచేసి ఓడినప్పుడు సంధికోసం పంపిన దూత ఖాజీ హైదర్ మొఘలుల తరపున యుద్ధం చేసి శివాజీని బంధించిన సైనికాధికారి రాజపుత్రుడు జైసింగ్ ఒక హిందు జైసింగ్ శివాజీని బంధించి తీసుకువెళ్తే అక్కడ ఔరంగజేబు చెరనుండి తన ప్రాణాలు అడ్డుపెట్టి మారువేశంలో శివాజీని చెరనుండి విడిపించినవాడు మదాని మొహతర్ ఒక ముస్లిం శివాజీ జీవితాన్ని ప్రభావితం చేసింది పరోక్షపు సమర్ధరామదాసు బోధనలు కన్నా ప్రత్యక్ష సమకాలీన హజ్రత్ బాబా యాకుత్ ఒక ముస్లిం ఆందుకు కృతజ్ఞతతో ఆ గురువుకి జీవితకాలం ఫించను ఏర్పాటు చేశాడు శివాజీ యుద్ధంలో ఖురాన్ కనిపిస్తే దాన్ని మర్యాదపూర్వకంగా ఇతర ముస్లింలకు అందజేయాలనే యుద్ధ నియమం విధించాడు. ఇస్లాం సైనికులకోసం తన రాజధాని రాయగడ్ లో తన రాజభవనానికి ఎదురుగా ఒక మసీదు నిర్మించాడు ముస్లిమే కాదు ఆ మాటకొస్తే క్రైస్తవాన్నీ గౌరవించాడు ఘుజరాత్ దాడిలో ధ్వంసమైన చర్చికి భూరి నిధులిచ్చి పునర్ నిర్మాణం చేయించాడు ఫాదర్ ఆంబ్రోస్ పట్ల అపార గౌరవం చూపాడు.

నిజానికి ముస్లిం పాలకులతో చివరికి ఔరంగజేబుతో కూడా సైనికపరమైన అధికారపరమైన ఘర్షణే తప్ప మరో వైరంలేదు శివాజీకి శివాజీ ఔరంగజేబు ఆస్థానంలో ఆఫ్ఘన్ ప్రాంతానికి మున్సబుదారుగా నియమించాడు రాజా అనే బిరుదునిచ్చాడు. శివాజీ తనజీవితకాలంలో ఎన్నడూ ఔరంగజేబు పాలనా ప్రాంతాలమీద దాడిచేయని విషయం గుర్తించాలి శివాజీ తర్వాత అతని సంతతిలో సాహూకు కూడా అదే రాజా అనే బిరుదుతో మన్సబుదారుగా నియమించాడు ఔరంగజేబు.ఇవన్నీ ఒకవైపు వాస్తవాలుగా వున్నప్పుడు హిందూ పాలకుడు అన్నవివాదం ఎందుకు అంటే

శివాజి ఒక శూద్రుడు కాబట్టి రాజుగా అంగీకరించడానికి నాటి మధ్య యుగాలనాటి కరుడుగట్టిన బ్రాహ్మణ వర్గాలు ఒప్పుకోలేదు మనుధర్మం కఠినంగా అమలయిన కాలమది జీవితకాలమంతా కష్టపడి ఒకరాజ్యంఏర్పరచుకున్నా అతడిని ఒక రాజుగా గుర్తించడానికి రాజ్యంలో ఏ బ్రాహ్మణుడూ ముందుకు రాకపోతే మనిషెత్తు బంగారం సమర్పించుకుని కాశీనుండి గంగబట్టు అనే బ్రాహ్మణుడిని పిలిపించి పట్టాభిషేకం చేసుకున్నాడు అదీ ఆ బ్రాహ్మణాడు కాలి బొటనవేలితో దిద్దిన తిలకంతో మహావీరుడు చత్రపతి శివాజీ ఇలా ఆయన చేసిన సేవలు ప్రజలకు అందించిన పొలాలు.

## కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సురేష్ ఎమ్మార్వోను మర్యాదపూర్వకంగా కలిశారు



**అలంపూర్ డివిజన్ ప్రజా జ్యోతీ ఫిబ్రవరి 19:**

అలంపూర్ నియోజకవర్గం ఐజ మున్సిపల్ చైర్మన్ గా గురువారం బాధ్యతలు చేపట్టడంతో మండల ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో జ్యోతి ని మర్యాదపూర్వకంగా కలిసి,పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించిన సీఎం.సురేష్ ఆయన మాట్లాడుతూ..ఐజ పట్టణ సమగ్ర అభివృద్ధి పనులకు రెవెన్యూ శాఖ తరపున పూర్తి సహకారం అందించాలని చైర్మన్ సీఎం.సురేష్ ఎమ్మార్వో ని కోరారు.సానుకూలంగా స్పందిస్తూ తమా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మార్వో తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలనరసింహులు,మాజీ ఎంపీ సుందర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు అశ్వమారప్ప,నర్సప్ప, అశ్వ పెద్ద,బాబి, నాగరాజు,సతీష్,బిఆర్ ఎస్వి నాయకులు తుప్పత్రాల వీరేష్ పాల్గొన్నారు.

## నర్వలో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు

**బజరంగ్దళ్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోరక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన గ్రామ శివాజీ మండలి యువకులు**



**నర్వ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం ఉదయం చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరిపారు ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు, ఇందులో గ్రామ సర్పంచ్ తీలేటి హనుమంత రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బుచ్చిరెడ్డి, వావిళ్ళ రవికుమార్ రెడ్డి, తో పాటు 60 మంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు అంతకంటే ముందు చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు అజయ్,దండు రామాంజి, నరేందర్ జి మచ్చందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల విజయమే లక్ష్యంగా ఉపాధ్యాయులు ఇంటింటి సందర్శన.

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాల 10వ తరగతి విద్యార్థుల యొక్క వార్షిక పరీక్షలు మార్చి 14 నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా పాఠశాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు బి భాను ప్రకాష్ యొక్క ఆధ్వర్యంలో విద్యార్థులు యొక్క ఇళ్లను సందర్శించి పేరెంట్స్ తో ముఖాముఖి మాట్లాడి విద్యార్థుల యొక్క పర్ఫామెన్స్ మరియు చదువు పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు కావలసినటువంటి వసతులు కల్పించి పాఠశాలకు రెగ్యులర్ వచ్చే విధంగా మరియు పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా తల్లిదండ్రులకు చూసించారు ఫిబ్రవరి 21 జరిగే పేరెంట్ మీటింగ్ కు అందరి తల్లిదండ్రులు హాజరు కావాలని అన్నారు



# మైనారిటీ విద్యార్థుల భాషా అభ్యాసంపై విశిష్ట పరిశోధన

**- అమ్తుల్ ఫాతిర్ ఫర్హీన్‌కు డాక్టరేట్**

**- సమగ్ర విద్యాభివృద్ధికి దోహదం చేసే పరిశోధనకు ఘన గుర్తింపు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19: ( ప్రజా జ్యోతి బ్యూరో )**

అమ్తుల్ ఫాతిర్ ఫర్హీన్ డాక్టరేట్ పట్టా సాధించి విద్యా రంగంలో విశిష్ట విజయాన్ని నమోదు చేసుకున్నారు. పాలమూరు యూనివర్సిటీ నుండి ఆమె ఉన్నత పట్టాను పొందారు.

తెలంగాణలోని మైనారిటీ వసతి విద్యాసంస్థల్లో ఉన్నత పాఠశాల స్థాయిలో మాతృభాషేతర మాధ్యమంలో చదువుతున్న ముస్లిం మైనారిటీ విద్యార్థులు ఆంగ్లభాష అభ్యసనలో ఎదుర్కొనే సమస్యలపై ఆమె విశ్లేషణాత్మకంగా పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధన సమగ్ర భాషా బోధన అవసరాన్ని స్పష్టంగా ప్రతిపాదిస్తుంది.

ఫర్హీన్ తన పాఠశాల విద్యను సెయింట్ ఆన్స్ హై స్కూల్ లో పూర్తి చేసి, సరోజినీ నాయుడు వనిత మహావిద్యలయలో ప్రాథమిక పట్టా మరియు పట్టభద్రోత్తర చదువులు పూర్తిచేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్శటీలో విద్యాశాస్త్రంలో పట్టభద్రోత్తర పట్టా పొందడంతో పాటు మానసికశాస్త్రం మరియు ఆంగ్లభాషల్లో కూడా పట్టాలు సాధించారు. విద్యా మరియు ఆంగ్లభాష విభాగాల్లో రాష్ట్ర స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. తన పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన మార్గదర్శక ఆచార్యులకు, విభాగాధిపతికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గురువులు మరియు సహకరించిన వారందరికీ ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. విద్యా రంగంలో సమగ్రత, సమానత్వాన్ని బలపరచే ఈ పరిశోధన భవిష్యత్ విధానాల రూపకల్పనకు తోడ్పడనుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



# చిన్నంబావిలో వాల్మీకిల ఆత్మీయ కృతజ్ఞతలు

**-- జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి పాలాభిషేకం**

**చిన్నంబావి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి):**

కొల్లాపూర్ రాజకీయాల్లో వాల్మీకి బోయలకు ప్రాధాన్యం పెరిగిందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన రెడ్డి జ్యోతి సత్యం గారికి కొల్లాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ పదవి దక్కడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో చిన్నంబావి మండల వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు.మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఉమేష్ నాయుడు మాట్లాడుతూ,కొల్లాపూర్ మున్సిపాలిటీలో ఇప్పటివరకు వాల్మీకి బోయలకు చైర్మన్ పదవి దక్కకపోవడం చారిత్రకంగా లోటుగా ఉండేదని, ఈసారి మంత్రి జూపల్లి కృష్ణారావు తీసుకున్న నిర్ణయం సామాజిక సమీకరణాలకు దారితీసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా విజయం సాధించిన రెడ్డి జ్యోతి సత్యం గారికి చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా వాల్మీకిలకు రాజకీయ గుర్తింపు లభించిందన్నారు.వాల్మీకి తాలూకా అధ్యక్షుడు పి. రాజుకుమార్ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు అధికారం దక్కాలనే దిశగా మంత్రి అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానించారు. వాల్మీకి సమాజానికి ఇది కేవలం పదవి కాదని, భవిష్యత్ రాజకీయ భాగస్వామ్యానికి నాంది అని తెలిపారు.యూత్ కాంగ్రెస్ మండల





అధ్యక్షుడు గంగారి శ్రీనివాసులు మాట్లాడుతూ, వాల్మీకి బోయలు ఇప్పటివరకు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ప్రస్తుతం వారికి లభించిన చైర్మన్ పదవి సమాజానికి గౌరవాన్ని తెచ్చిందన్నారు. బీసీ వర్గాల సమీకరణలో ఇది కీలక మలుపుగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కొల్లాపూర్ ప్రాంతంలో బీసీ ఓటు బ్యాంక్‌ను బలోపేతం చేయాలనే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. అన్నారు.కార్యక్రమంలో చిన్నంబావి మండలంలోని పలు గ్రామాల వాల్మీకి సోదరులు పాల్గొని మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం నినాదాలు, శుభాకాంక్షల మధ్య ముగిసింది.

## ఎమర్జెన్సీ సర్వీసులు ఆకస్మిక తనిఖీ


**చిన్నంబావి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి)**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108, 102 అంబులెన్స్ సేవలు అత్యుత్తమంగా పనిచేస్తున్నాయని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె. రవి తెలిపారు. గురువారం చిన్నంబావి మండల కేంద్రంలోని 108/102 అంబులెన్సులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.అంబులెన్స్‌లలోని అత్యవసర వైద్య పరికరాల పనితీరు, ఆక్సిజన్ సిలిండర్లు, ఫస్ట్ ఎయిడ్ సామగ్రి, అవసరమైన మందుల నిల్వలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందించడం అత్యంత కీలకమని, సేవల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.108 అంబులెన్స్‌ల ద్వారా ప్రమాద బాధితులు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు వేగంగా తరలిస్తూ ప్రజలకు ప్రాణరక్షక సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గర్భిణీలు, చిన్నారుల కోసం 102 అంబులెన్స్ సేవలు కూడా సమర్థంగా కొనసాగుతున్నాయని తెలిపారు.మండల ప్రజలు ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా 108 కు కాల్ చేసి సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెహబూబ్, రత్నమయ్య, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీధర్, పైలెట్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డి నేటి పర్యటన వివరాలు

**నాగర్ కర్నూల్: ఫిబ్రవరి 19ప్రజా జ్యోతి**



నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్.కూచుకుళ్ళరాజేష్ రెడ్డి నేటి నియోజకవర్గ పర్యటనలోభాగంగా ఉదయం 08.00 గంటలకు తెల్కపల్లి మండలం కార్వంగ గ్రామంలో నూతన సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతారు.9:30గంటలకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని "క్రిస్టల్ ఫ్యాన్సీ స్టోర్" షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.10.00 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెల్కపల్లి మండలానికి చెందినకళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారు.11.30 గంటలకు బిజనపల్లి మండలం గంగారం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు 12.00గంటలకు బిజినపల్లి మండల పోలేపల్లి గ్రామంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు.12.30 గంటలకు జిల్లాకేంద్రంలోని తీగల కన్వెన్షన్ హాల్ లో జరిగే వివాహ వేడుకకు హాజరవుతారు.01.00 గంటలకు నాగర్ కర్నూల్ మండలంలోనిపెద్దాపూర్ గ్రామంలో జరిగే వివాహ వేడుకకుహాజరవుతారు.02.00 గంటలకు తాడూర్ మండల మెడిపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు.కావున ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొనగలరని మనవి.

## శివాజీ జయంతి శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్

**- ధర్మరక్షణ, స్వరాజ్య స్ఫూర్తి యువతకు ఆదర్శమని వ్యాఖ్యానం**




**మహబూబ్ నగర్ ఫిబ్రవరి 19: ( ప్రజా జ్యోతి బ్యూరో )**

హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పాలమూరు పట్టణం బండమీదిపల్లిలో "హిందూ వాహిని" ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శోభాయాత్రలో బండారు శాంతి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో శాంతికుమార్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ ధర్మరక్షణ, దేశభక్తి, సుశాసనానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. స్వరాజ్య సాధనలో ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు, సమాజ గౌరవాన్ని కాపాడిన త్యాగస్ఫూర్తి ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని, శివాజీ మహారాజ్ ఆశయాల సాధన కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ శోభాయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, హిందూ వాహిని ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆస్తి వివాదంలో అన్నదమ్ముల మధ్య గొడవ

**-తమ్మునిపై కర్రలతో దాడి చేసిన అన్న**



ఎర్రవల్లి/ఇటిక్యాల:(ప్రజా జ్యోతి) ఫిబ్రవరి 19: జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం శేక్ పల్లె గ్రామంలో దారుణ సంఘటన చోటు చేసుకుంది.అల్లంపూర్ సిఐ ప్రదీప్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి, రక్తం పంచుకుని పుట్టిన అన్నదమ్ములు భూమి వివాదాలు ఇంటి ముందు ట్రాక్టర్ విషయంలో సొంత అన్న బండి కృష్ణుడు, కుమారులు బండి శ్రీకర్,బండి భాస్కర్, కుటుంబ సభ్యులు కలిసి తమ్ముడు బండి రాముడు పై కర్రలతో దాడి చేశారు,ఆ ఘటనలో తమ్ముడు బండి రాముడు కి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్సకొరకు కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు,చికిత్స పొందుతూ బండి రాముడు మృతి చెందాడు, హరిబాబు పావనిలకు గాయాలయ్యాయి, నిందితులు బండి కృష్ణుడు, బండి భాస్కర్,బండి శ్రీకర్ లను బుధవారం అదుపులో తీసుకొని రిమాండ్ కు తరలించిన పోలీసులు

## గంగ మంచాలమ్మ జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**కొల్లాపూర్ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి**

కోడేరు మండలం జనపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం గంగ మంత్రాలమ్మ జాతర సిడే ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు అందులో భాగంగా సిడే అనేది ఒక ఘటం చూడడానికి చుట్టుముట్టు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని మొక్కుబడులు తీర్చుకోవడానికి అమ్మవారి ఆశీర్వాదం దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తజనం గురువారం రోజు రాజాపూర్ గ్రామంలో సీతా రామాంజనేయ పలకల భజన భక్త బృందం భాగంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి భజన పలకలతో పలక బజన భక్త బృందంలో పాల్గొని భజనలు చేశారు. చుట్టుముట్టు పక్కల ఉన్న గ్రామ ప్రజలు పోటెత్తిన భక్తులు గంగ మంచాలమ్మ జాతరలో మొక్కుబడులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో భక్త జనాలు పాల్గొన్నారు షిడే ఊరేగింపులో భక్తులు భజనలతో సిడే ను ఊరేగించారు

